క్లుప్తంగా

నేడు కొత్తపురమ్మ జాతర


అమ్మవారి మూలవిరాట్టు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీ కొత్త పుర్మమ్మ జాతరను నేడు(బుధవారం) నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. జాతర సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆలయాన్ని వివిధ రకాల విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

జెడ్‌హెచ్‌డీసీ భూముల పరిశీలన


భూములు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నదియా దేవి

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జెడ్‌హెడ్‌డీసీ భూములను మంగళవారం సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించి రికార్డులను పరిశీలించి ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారన్న వివరాలను తహసీల్దార్ శ్రీధర్ రావుతో ఆరా తీశారు. భూములకు సంబంధించిన రికార్డులు లబ్ధిదారుల వివరాలు అన్నీ తన కార్యాలయానికి పంపించాలని ఆమె ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, సర్వేయర్ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సప్తమ వార్షికోత్సవానికి రామాలయం ముస్తాబు


కదిరివాండ్లపల్లెలో ఉన్న సీతారామాలయం

చిన్నమండెం : మండల పరిధిలోని కదిరివాండ్లపల్లెలో వెలసియున్న శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వారి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి సప్తమ వార్షికోత్సవ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పలు పూజాది క్రతువులను చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్వామి వారికి ఎదురుకోళ్లు అనంతరం తిరు కల్యాణ మహోత్సవం, మహా మంగళ హారతి జరుగుతుందన్నారు. గురువారం అల్పాహారంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వార్షికోత్సవ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు

సిద్దవటంలో కార్డెన్ సెర్చ్


నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దవటం : మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు నాకాబందీ కార్యక్రమం నిర్వహించామని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటం కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల గృహాల్లో, వాహనాల తనిఖీ చేశామన్నారు. రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, చోరీల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అనుమానితులు ఎవరైనా గ్రామాల్లో తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ భాష ప్రాచీనమైంది


ర్యాలీ నిర్వహిస్తున్న ఉర్దూ భాషా ప్రేమికులు

రాయచోటి టౌన్ : భారతదేశ ప్రాచీన భాషగా ఉర్దూ భాష నిలుస్తుందని మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ హిదాయతుల్లా అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలో ఛలో ఉర్దూ లైబ్రరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషను ద్వితీయ భాషగా గుర్తించిందని చెప్పారు. ఉర్దూ భాష ప్రాముఖ్యతను ప్రజలలోకి తీసుకెళ్లడం కోసం, ఉర్దూ భాషా ప్రేమికులను, ఉర్దూ భాషా సాహితీవేత్తలను గుర్తించుటకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ గ్రంథాలయ అధికారి షేక్ కరీముల్లా, ఉర్దూ భాష ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, అంజాద్, జమీయ ఉలేమాయే హింద్ రాష్ట్ర సెక్రటరీ ఇందాదుల్లా ఖాన్, సహారా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జిలాన్, అమీర్, ఉర్దూ కవులు మహమ్మద్ అలీ, దర్బార్, సయ్యద్ ఫయాజ్ అలీ, టీడీపీ నాయకుడు గోల్డ్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మారెమ్మ గుడికి మహర్దశ

- నాగిరెడ్డిపల్లె గ్రామదేవతగా పూజలు అందుకుంటున్న మారెమ్మ
- భక్తులు విరాళాలతో ఆలయ అభివృద్ధి పనులు
- ఏ కార్యక్రమమైనా అమ్మవారి గుడి నుంచే ప్రారంభం


నాగిరెడ్డిపల్లె గ్రామ దేవత శ్రీ మారెమ్మ


మారెమ్మ గుడిలో ముమ్మరంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

రాజంపేట : నియోజకవర్గంలో ప్రధాన మండలం నందలూరు. ఆ మండలంలో నాగిరెడ్డిపల్లె పంచాయతీ గ్రామదేవతగా విరాజిల్లుతున్న శ్రీ మారెమ్మ గుడికి మహర్దశకు నోచుకుంటోంది. ఏళ్ల చరిత్ర కలిగిన మారెమ్మ ఈ ప్రాంత భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధికెక్కారు. అర్బన్ కేంద్రమైన నాగిరెడ్డిపల్లె శివార్లలో పూర్వం ఒకప్పుడు కేవలం చిన్నగుడిగా మారెమ్మ ఆలయం ఉండేది. శివారు ప్రాంతం కావడంతో పెద్దగా జనజీవనం లేదు. అప్పట్లోనే అమ్మవారికి యేటా జాతరను ఘనంగా నిర్వహించుకునేవారు. కాలానుగుణంగా శివారు ప్రాంతం కాస్త ఇప్పుడు జనావాసాలు అధికమయ్యాయి. దీంతో చిన్న గుడి భక్తులు సహకారంతో దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. ఎన్నడూ లేనంతా ఈ సారి భక్తులందరూ ఏకతాటిపైకి వచ్చి, ఆలయం అభివృద్ధికి ఎవరి స్థాయిలో వారు ముందడుగు వేశారు.

ఏడూర్ల జాతరగా..

నాగిరెడ్డిపల్లె గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి జాతర ఏడూర్ల జాతరగా ఒకటిన్నర శతాబ్దం కిందట అత్యంత వైభవోపేతంగా నిర్వహించుకున్నారని పూర్వీకులు చెబుతున్నారు. నాగిరెడ్డిపల్లె చుట్టూ ఉన్న ఏడు ఊర్ల ప్రజలు నాగిరెడ్డిపల్లె గ్రామ దేవత మారెమ్మ జాతర కలిసిమెలిసి సమైక్యంగా అత్యంత ఘనంగా నిర్వహించుకునేవారన్నారు. నాగిరెడ్డిపల్లె, గొల్లపల్లె, నారాయణరాజుపేట, ఇసుకపల్లె, కుమ్మరపల్లెతో పాటు మరో రెండు గ్రామాలు కలిసి జాతరను జరుపుకున్నట్టు సమాచారం. ఈ ఏడూర్ల గ్రామస్తులు నాగిరెడ్డిపల్లె మారెమ్మ గుడి వద్దకు చేరుకొని జాతరను ఏడురోజుల పాటు ఘనంగా నిర్వహించుకునేవారు. కాలానుగుణంగా ఏడూర్లలో ఏ గ్రామానికి, ఆ గ్రామంలో అమ్మవారికి పొంగుబాళ్లు పెట్టుకొని జాతర నిర్వహించుకుంటున్నారు. అయితే ఈ సారి ఏడూర్ల గ్రామాలకు చెందిన వారు నాగిరెడ్డిపల్లె మారెమ్మ జాతరలో భాగస్వామ్యం కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

భక్తుల విరాళాలతో గుడి అభివృద్ధి పనులు

భక్తుల విరాళాలతో మారెమ్మ గుడి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గతంలో ఈ మారెమ్మ గుడి స్థానికతకే పరిమితమయ్యేది. అయితే ఇప్పుడు నాగిరెడ్డిపల్లె అర్బన్ ప్రాంతమంతా అమ్మవారి జాతర నిర్వహణకు తోడ్పాటును అందిస్తున్నారు. నాగిరెడ్డిపల్లె నుంచి డీఎంసీ రోడ్డు నుంచి నందలూరు శివారు(బస్టాండ్ వరకు) మేజర్ పంచాయతీ పరిధి విస్తరించింది. నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలో అన్ని ప్రాంతాల వారూ మారెమ్మ గుడి అభివృద్ధికి తమవంతుగా ముందుకువచ్చారు.

ఏ కార్యక్రమమైన మారెమ్మ గుడి నుంచే..

నాగిరెడ్డిపల్లె గ్రామదేవతగా విరాజిల్లుతున్న మారెమ్మ అమ్మవారి వద్ద నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించిన అది విజయవంతమవుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు ఇక్కడి అమ్మవారికి పూజలు చేసిన ప్రచారం ప్రారంభించేవారు. తాము అనుకునే ఎటువంటి కార్యక్రమమైన అమ్మవారిని దర్శించుకొని చేపడితే చకచకా జరిగిపోతుందనే నమ్మకం భక్తుల్లో నాటుకుపోయింది. అమ్మవారిని నమ్ముకున్న అనేక మంది ఇప్పుడు ఆర్థికంగా బలపడినవారు ఉన్నారు. ఆపదలో నుంచి బయటపడిన వారు ఉన్నారు. వీరందరూ అమ్మవారిని పూజించడం వల్లనే మేలు జరిగిందనే భావనలతో నిరంతరం అమ్మవారిసేవలో ఉన్నారు.

అందరి కృషితో మారెమ్మ గుడి అభివృద్ధి



నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ ప్రజలందరి సహకారం, కృషితో మారెమ్మ గుడి అభివృద్ధి జరుగుతోంది. అత్యంత మహిమలు కలిగిన అమ్మవారిని వేడుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకం భక్తులలో అపారంగా ఉంది. త్వరలో జాతర జరుగనుంది. భక్తుల విరాళాలతో ఆలయం ఆధునీకికరణ పనులు జరుగుతున్నాయి. పూర్వం ఏడూర్ల జాతర అత్యంత వైభవోపేతంగా జరిపేవారని పెద్దలు చెబుతుండే వారు, అదే విధంగా అందరి కలుపుకుని ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం.

– ఆర్ముగం విశ్వనాథ్, నాగిరెడ్డిపల్లె, నందలూరు

భక్తుల కష్టాలు తీర్చే తల్లి మారెమ్మ



మారెమ్మ తల్లి మహిమాన్వితం కలిగినది. భక్తుల కష్టాలను తీర్చే అమ్మవారిగా నాగిరెడ్డిపల్లె అర్బన్ ఏరియాలో భక్తులు కొలుచుకుంటున్నారు. అమ్మవారి గుడి ఇప్పుడు ఆధునీకికరణతో మహర్దశకు నోచుకుంది. చరిత్ర గలిగిన మారెమ్మ గుడి, ఒకప్పుడు ఏడూర్ల జాతర జరిగేదని పూర్వీకులు చెపుతున్నారు. భక్తులు సమైక్యంగా అమ్మవారి గుడిని అభివృద్ధి చేసుకోవాలి. వైభవంగా జాతర నిర్వహణకు భక్తులు సహకారం అందించాలి.

– అరిగె మణి, నాగిరెడ్డిపల్లె, నందలూరు

100 క్వింటాళ్ల జనుములు మంజూరు


రమేష్‌రెడ్డి, ఏఓ

సిద్దవటం : మండలానికి 100 క్వింటాళ్ల జనుములు విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రైతుసేవా కేంద్రంలో జనుముల విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. 2025 ఖరీఫ్‌కు సంబంధించి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో భాగంగా జనుము విత్తనాలు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జీలుగలు మాత్రం ఈ సీజన్‌కు అందుబాటులో లేవని చెప్పారు. ఒక ఎకరానికి 10 కిలోల విత్తనాల మోతాదు, తద్వారా 8 నుంచి 10 టన్నులు పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందన్నారు. ఒక టన్ను పచ్చిరొట్ట ఎరువులో 4 కిలోల నత్రజని, 1కిలో భాస్వరం, 5.3 కిలోల పొటాష్, లభిస్తుందని తెలిపారు. పూర్తి ధర 10 కిలోలు రూ. 1090 కాగా 50 శాతం సబ్సిడీ పోను రైతు చెల్లించాల్సిన ధర రూ. 545 మాత్రమేనన్నారు. జనుము విత్తనాలు కావలసిన రైతులు రిజిస్ట్రేషన్‌కు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని తెలియజేశారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరగాలి


మాట్లాడుతున్న కడప ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్

సిద్దవటం : చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంపునకు వ్యవసాయాధికారులు కృషి చేస్తున్నారని ఊటుకూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో మంగళవారం కడప ఊటుకూరు ఏరువాక కేంద్రం వారి ఆధ్వర్యంలో చిరు ధాన్యాలు సాగులో కీలక నిర్వహణ పద్ధతులు, విలువలు జోడింపు అనే అంశంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాలలో పొట్టు లేనివి మూడు రకాలు ఉన్నాయని, అవి జొన్న, సజ్జ, రాగి వీటికి పైపొట్టు తొలగించాల్సిన అవసరం లేదన్నారు. మిగతా 6 చిరు ధాన్యాలు కొర్రలు, అండు కొర్రలు, ఊదలు, అరికలు, సామలు, బరిగలు ఉన్నాయన్నారు. వీటిని ఆహారానికి, ఆదాయానికి, పశుగ్రాసానికి సాగు చేస్తారన్నారు. విత్తన మోతాదు కూడా చాలా తక్కువ, వీటిని పోషక తృణధాన్యాలు అని కూడా పిలుస్తారన్నారు. గ్లూటెన్ రహిత, గ్లైసిమిన్ సూచిక తక్కువ, ఆహారం పీచు, విటమిన్స్, జింక్, ఐరన్, మెగ్నీషియం, పొటాష్ వంటి ఖనిజాలు ఉంటాయన్నారు. మల బద్ధకాన్ని నివారిస్తాయన్నారు. వీటితో రొట్టెలు, ముద్ద, బిస్కెట్స్, మాల్ట్, జావా వంటివి కూడా తయారు చేస్తారన్నారు. ఇంట్లోనే ఉండి విలువ జోడింపు చేస్తే ఆదాయం బాగా ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారికి కృషి విజ్ఞాన కేంద్రం పూర్తి స్థాయి శిక్షణ ఇస్తుందన్నారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద భారతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ సౌజన్యంతో ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బద్వేల్ ఏడీఏ నాగరాజ మాట్లాడుతూ చిరు ధాన్యాలు అంతర పంటగా, మిశ్రమ పంటలుగా సాగు చేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, సిద్దవటం సీఈఓ సునీల్‌కుమార్, రైతులు, మహిళలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏకలవ్య రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే వ్యాపారులపై చర్యలు


చికెన్ దుకాణ నిర్వాహకుడికి సూచనలు చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట : పట్టణంలోని పరిశుభ్రత నియమాలను పాటించని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని రాజంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం చికెన్, మటన్ స్టాల్స్, కుష్కా సెంటర్లు, టిఫెన్ సెంటర్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను తమ దగ్గర నిల్వ ఉంచుకొని మున్సిపల్ శానిటేషన్ వాహనాలు వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు. చెత్తను రోడ్లపై వేయడం జరిగితే చట్టపరంగా జరిమానాలు విధిస్తామన్నారు. చికెన్, మటన్ దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యర్థాలను రోడ్లపై వేయడం మానుకోవాలన్నారు. వ్యర్థాల వల్ల దుర్గంధం వెదజెల్లి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. మున్సిపాలిటీ నియమ, నిబంధనలు పాటించకుంటే అవసరమైతే లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. పట్టణవాసులు వ్యాపారులు సహకరించి రాజంపేటను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచాలన్నారు. స్వచ్ఛ రాజంపేటకు బాటలు వేయాలన్నారు.

పుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తప్పవు

ట్రాఫిక్ రద్దీని దృష్టిలో వుంచుకొని పుట్‌పాత్ ఆక్రమణలపై దృష్టి సారిస్తామని, ఆ విధంగా ఆక్రమణలు ఉంటే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ నేపథ్యంలో పట్టణంలో పలు రోడ్లను పరిశీలించారు. రోడ్డుపై వ్యాపార కార్యకలాపలు చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఎవరైనా రోడ్డు ఇటు వైపు కాకుండా కాలువకి అటు వైపున తమ వ్యాపారాలు, వాహనాలను పార్కింగ్ చేయాలని తెలియజేశారు.

వైభవంగా ఆరెమ్మ తల్లి తిరునాల


ప్రత్యేక అలంకరణలో ఆరెమ్మ


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

సుండుపల్లె : మండల కేంద్రంలో వెలసిన ఆరెమ్మ తల్లి తిరునాల ఆలయ ధర్మకర్త వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఎర్రపురెడ్డి ఆరంరెడ్డి మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు వేకువజాము నుంచి అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణములతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చాందినీబండ్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సుఖసంతోషాలు ప్రసాదించు తల్లి

ప్రజలందరికీ సిరిసంపదలు కల్పించి, సుఖసంతోషాలను ప్రసాదించాలని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి ఆరెమ్మ తల్లిని మొక్కుకున్నారు. మంగళవారం ఆరెమ్మ తిరునాలకు హాజరై ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులతో మాట్లాడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు యర్రపురెడ్డి అజయ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అజంతమ్మ, మహిళా అధ్యక్షులు రెడ్డమ్మ, మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ రెహమాన్‌ఖాన్, సర్పంచ్ రామాజయచంద్ర, ఎంపీటీసీలు నంద్యాల నాగేశ్వరరావు, నాగరాజ, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలను తెలుసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ సుగుణ

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె పంచాయతీ బాపూజీనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికల అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ సుగణ మాట్లాడుతూ బాలల హక్కులు – రక్షణ, పోక్సో చట్టాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, మహిళా సంరక్షణ కార్యదర్శి ఆశమ్మ, డీసీపీయూ కౌన్సిలర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పిస్తాం


ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

గాలివీడు : జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలందరికీ పని కల్పిస్తామని ఎంపీడీఓ జవహర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల తనిఖీలో భాగంగా అరవీడు గ్రామంలో జరుగుతున్న పెద్దచెరువు కాలువ పూడిక తీత పనులను ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం కూలీల హాజరు మస్టర్ ప్రకారం ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రధాన మంత్రి బీమా యోజనపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రామచంద్ర, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవమూర్తుల ఊరేగింపు


ఆకట్టుకున్న వేషధారుల నృత్యాలు

వీరబల్లి : మొలకల పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని హరిహరాదుల దేవస్థానంలో కొలువైవున్న లక్ష్మీనారాయణ, శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు సోమవారం రాత్రి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవతల వేషధారణలో భక్తి పాటలతో నృత్యాలు చేసుకుంటూ తప్పెట్లు, తాళాలతో ఘనంగా ఊరేగించారు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఊరేగింపు సాగింది. మండల కేంద్రంలో ఉన్న భక్తులు, దేవతలకు కాయా కర్పూరం సమర్పించి హారతులు పట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

గాలివీడు : మండలంలో పూర్తిస్థాయిలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు వెంటనే కల్పించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబును వారు కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఎగువగొట్టివీడు, చీమలచెరువుపల్లి, గోరాన్ చెరువు తదితర గ్రామాల్లో పూర్తిస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించడంలో ఘోరంగా విఫలం అవుతున్నారని ఆరోపించారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ఉపాధి హామీ పథకం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే ఉపాధి కూలీలకు భద్రత కల్పించాలని కోరారు. ముఖ్యంగా ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలపై కక్ష సాధింపు చర్యలకు పూనుకోకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు మావిళ్ల రఘునాథ్ నాయుడు, పూసపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.

‘ఏడాది పాలనలో కూటమి చేసిందేంటి?’

వైఎస్ జగన్ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి : శిబ్యాల విజయభాస్కర్


మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి జగదాంబ సెంటర్ : వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి ఏంటో కళ్లకు కట్టినట్లు చూపిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా సూపర్‌సిక్స్ పథకాలను గాలికి వదిలేశారని.. నేతి బీరకాయలో నెయ్యి ఉండదు.. చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం ఉండదని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వంలో ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారన్నారు. 16 లక్షల ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల కల్పన.. రూ.2.80 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాలలోకి వేసి సాయం అందించిన నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి రూ.70 వేల కోట్లు పెట్టుబడులు తెచ్చారని రూ.13 లక్షల కోట్లు ఒప్పందాలు, ప్రభుత్వ భవనాల కల్పన, పోర్టుల నిర్మాణం ఇలా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలం అవుతున్నా కేవలం డైవర్షన్ పొలిటిక్స్, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతూ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా కనువిప్పు కలిగి సూపర్ సిక్స్ హామీలను అమలుపరిచేలా పాలన సాగించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, గ్రీవెన్స్ అధ్యక్షులు గువ్వల బుజ్జిబాబు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు అనిల్, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నల్లగంగమ్మ జాతర


నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు


ప్రత్యేక ఆకర్షణగా చాందినీ బండ్లు

సంబేపల్లె : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ జాతర మంగళవారంతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషంగా పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, చాందినీబండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జాతరకు వచ్చిన భక్తులను వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి సమస్య


దాహం తీర్చుకునేందుకు అరకొరగా వస్తున్న నీటి పట్టుకుంటున్న రోగుల బంధువులు

సిద్దవటం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండు రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. నీటి సమస్య వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బంది తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ఆసుపత్రికి సిద్దవటంతోపాటు అట్లూరు, ఒంటిమిట్ట మండలాల నుంచి రోగులు వస్తుంటారు. మంగళవారం మధ్యాహ్నం రోగులు భోజనం తిన్న తరువాత తాగునీటి కోసం అవస్థలు పడ్డారు. రోగులతో పాటు వచ్చిన వారు బయటకు వెళ్లి వాటర్ ప్యాకెట్లు కొని దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. సంబంధిత డాక్టర్లు రోగులకు తాగునీరు సమస్య లేకుండా చూడాలని రోగులు కోరుతున్నారు.

సికెల్ సెల్ అనీమియాపై అవగాహన తప్పనిసరి


సుండుపల్లె: అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


పుల్లంపేట: మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్ చంద్ర, డాక్టర్ సానే శేఖర్

సుండుపల్లె : ప్రజలందరూ సికెల్‌సెల్ అనీమియా పట్ల జాగ్రత్తలు వహించాలని డాక్టర్ ఫరానా ఖానం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సికెల్ సెల్ అనీమియాపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి దండ్రుల నుంచి అనువంశికంగా ఈ అనీమియా సంక్రమిస్తుందని, దీనిని రక్త పరీక్షల ద్వారా నిర్ధారించుకుని చికిత్స ద్వారా అరికట్టవచ్చన్నారు. గిరిజన ప్రాంతాలలోని ప్రజలకు వ్యాధి గురించి తెలియపరిచి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట : పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ సానే శేఖర్, డాక్టర్ మనోజ్ చంద్రల ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన గురించి మండల స్థాయి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సానే శేఖర్ మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఎర్ర రక్తకణాల రుగ్మత అని, ఇది తల్లిదండ్రుల నుంచి అనువంశంగా సంక్రమిస్తుందని, 0 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు పరీక్షించుకోవాలన్నారు. ఈ వ్యాధి లక్షణాలు రక్త కణాల సంఖ్య తగ్గిపోవడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, కండరాలు నొప్పులు, అలసట, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. 2047వ సంవత్సరం నాటికి ఈ వ్యాధిని నిర్మూలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, కావున మండల ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలని వారు వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.